



సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్

పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి
- ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 18: జిల్లాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వేడుకలను అధికారికంగా నిర్వహించారు. సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక్‌నగర్‌లో గల సర్వాయిపాపన్నపగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్, నగర మేయర్ నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ప్రభుత్వం పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు పాపన్నగౌడ్ పోరాటాలను నిర్వహించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీతకార్మికుల కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారిని స్రవంతితో పాటు బీసీ సంఘాల నేతలు శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



కబ్జాలపై పట్టింపేది?

- నగర పరిధిలో యథేచ్ఛగా భూముల కబ్జాలు
- పేదల భూములు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు
- కబ్జాదారులకు ప్రజాప్రతినిధుల వత్తాసు
- చర్యలు లేకుండా వదిలేస్తున్న అధికారులు
- న్యాయం చేయాలని బొందలగడ్డ చెరువు బాధితుల ఆందోళన
- చర్యలు చేపట్టాలని పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా



నగరంలోని ఐదవ టౌన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నిజామాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకునే వారు లేరు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కూడా కబ్జా చేసిన వారిపై చర్యలు లేవు. ప్రభుత్వ భూములతో పాటు చెరువు శిఖంలు ఆక్రమించి చట్టంలోని లొసుగులను వినియోగించి ప్లాట్లను అమ్మకాలు చేసిన పట్టించుకునే వారు లేరు. భూముల ఆక్రమణకు పాల్పడిన వారికి ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో కనీసం ఆవైపు చూసిన వారు కూడా లేరు. గతంలో ఈ భూముల వ్యవహారంపై ఆర్‌డీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి బాధ్యులైన వారిపై నివేదికలు ఇచ్చినా కనీసం చర్యలు చేపట్టలేదు. అప్పటి అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవడంతో నివేదికలను బుట్టదాఖలు చేశారు. ఈ భూములన్నీ నమ్మి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదలు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు కబ్జాకు గురికావడంతో కనీసం తిరిగి తమకు భూమి ఇప్పించాలని కోరినా పట్టించుకునేవారు లేరు. ప్రభుత్వం మారిన భూ ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. నగరంలోని బొందంగడ్డ చెరువు శిఖం భూమి పరిధిలో ఇళ్లను కూలగొట్టడంతో పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి తమకు న్యాయం చేయాలని అధికారులను బాధితులు కోరారు. మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగర పరిధిలో చెరువులతో పాటు కుంటలు ఒకనాడు భారీగా ఉండేవి. నగరం పెరిగిన కొద్దీ కుంటలు మాయమయ్యాయి. చెరువుల్లోని శిఖం భూములు కబ్జాలకు గురయ్యాయి. రెండేళ్ల క్రితం జిల్లా వ్యాప్తంగా చెరువులకు సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో నగరం పరిధిలో సుమారు 20కుంటల వరకు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. కొన్ని కుంటల సైజులు తగ్గిపోగా మరికొన్ని కుంటల్లో నీళ్లు నిలువలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చెరువుల శిఖం భూములు కూడా ఆక్రమణకు గురైనట్లు సర్వేలో తేల్చారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఆయా చెరువులు, కుంటల వద్ద ట్రెన్స్‌లను కొట్టారు. తర్వాత వాటిని వదిలివేశారు. రెండేళ్లలో నగరం పరిధిలో మరికొన్ని కుంటలు, చెరువులకు సంబంధించిన భూములు కూడా కొంత మేర కబ్జాకు గురయ్యాయి. నగరం విస్తీర్ణం పెరగడం భూముల రేట్లు పెరగడం వల్ల కబ్జాలు కూడా అదే స్థాయిలో ఎక్కువగా అయ్యాయి.

ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో నాగారం, ధర్మపురి హిల్స్, బాబన్‌సాహెబ్ పహడ్, అర్సపల్లి, పాంగ్రా, బోర్గాం, గూపన్‌పల్లి, ముబారక్‌నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చారు. పట్టాలను మంజూరు చేశారు. కొంత మంది పేదలు వీటిలో ఇండ్లను నిర్మించుకోగా మరికొంత మంది కట్టుకునే స్థోమత లేక వదిలివేశారు. వీటితో పాటు పలు సంఘాల కార్మికులకు కూడా ఈ ఇళ్ల స్థలాలను కేటాయించారు. నిజామాబాద్ మున్సిపాలిటీ నుంచి నగర కార్పొరేషన్‌గా మారిన తర్వాత భూముల రేట్లు భారీగా పెరిగాయి. శివారు గ్రామాలు కూడా కార్పొరేషన్‌లో కలిపిన తర్వాత ఎక్కువ మొత్తంలో ధరలు వచ్చాయి. వ్యవసాయ భూములకు కూడా ధరలు పెరిగాయి. జిల్లాలోని ఇతర గ్రామాల నుంచి కూడా పిల్లల చదువుల కోసం ఎక్కువ మంది నిజామాబాద్‌కు రావడం వల్ల ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. నగర శివారుల్లో పలు కాలనీలు వెలువడంతో పాటు అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం భారీగా జరిగింది. ఇండ్ల స్థలాలకు డిమాండ్ పెరగడంతో అక్రమాలకు తెర లేచింది. గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన భూముల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లు ఎక్కువ మొత్తంలో కబ్జాకు గురయ్యాయి. వాటిని ఇతరులకు అమ్మకాలు చేశారు. వాటిలో ఇండ్లు కూడా వెలిశాయి. అసలైన లబ్ధిదారుడు ప్లాట్ల కోసం వస్తే వారిని బెదిరించి పంపడంతో పాటు వారి ప్లాట్లకు సంబంధించిన డుప్లికేట్ పేపర్లను తీసి వారినే బెదిరించారు. అలాంటి ఎంతో మంది లబ్ధిదారులు గత పదేళ్లలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొంత మందికి అక్కడే సెటిల్‌మెంట్‌లు చేస్తూ కొంత మొత్తంలో డబ్బులు ఇచ్చి పంపించి వేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంటే రాత్రికి రాత్రే ఇండ్లను నిర్మించి అమ్మకాలను చేశారు. ఈ అక్రమాలపై రెండేళ్ల క్రితం ఆందోళనలు భారీగా జరగడం, ఎంపీ అర్వింద్ ఆ ప్రాంతాలను పర్యటించి ఫిర్యాదులు చేయడంతో అధికారులు కదిలారు. సర్వేలు సుమారు పది రోజుల పాటు నిర్వహించారు. అక్రమాలను గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలను తీసుకోలేదు. అసలైన లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించలేదు. అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో అధికారులు నివేదికను పరిశీలించకుండానే వదిలివేశారు. ప్రజాప్రతినిధుల అండదండలతో భూముల ఆక్రమణ మరింత పెరిగింది. ప్రభుత్వ భూములు ప్లాట్లుగా పేదలకు ఇచ్చిన చోట పక్కనే ఉన్న చెరువు శిఖాలను, అటవీ భూములను ఆక్రమించి ఇండ్ల నిర్మాణం చేపట్టారు. గత కొన్నేళ్లుగా నగరం పరిధిలోని పలు సంఘాలకు కేటాయించిన భూములను కూడా కబ్జా చేశారు. చివరకు స్పోర్ట్స్‌కు, స్టేడియాలకు, మిలటరీ ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు కేటాయించిన భూములను కూడా వదలడం లేదు. భూముల కబ్జాకు పాల్పడటంతో పాటు వాటికి మున్సిపాలిటీ నుంచి ఇంటి నెంబర్లు తీసుకోవడంతో పాటు ఇండ్ల నిర్మాణం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

నగర శివారులోని బొందల గడ్డ చెరువుపై అక్రమాలకు పాల్పడి ఇళ్ల నిర్మాణం చేపట్టినా.. అధికారులు మొదట పట్టించుకోలేదు. చివరకు అధికారులకు ఫిర్యాదులు అందడం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో రెండు రోజుల క్రితం వీటిని కూలగొట్టారు. దీంతో ఈ ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న పేదలు ప్రస్తుతం కూలగొట్టడంతో రోడ్డుపాలయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని ఆందోళన నిర్వహిస్తున్నారు. నగరం పరిధిలోని ఐదవ టౌన్ వద్ద ఆదివారం ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. భూములు అమ్మకాలు చేసి తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇండ్లు కోల్పోయిన వారందరూ తమ కుటుంబ సభ్యులతో స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. వీరికి ఎంఐఎం నేతలు మద్దతు పలికారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం : ఆర్‌డీవో

చెరువు శిఖం భూములను ప్లాట్లు చేసి అక్రమంగా అమ్మకాలు చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడుతామని ఆర్‌డీవో రాజేంద్రకుమార్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం ఆధారంగా ప్రభుత్వ భూమిలో ఇండ్లను నిర్మించుకోవడం వల్ల వాటిని తొలగించామన్నారు. వారిని ఎవరైనా మోసం చేసి అమ్మకాలు చేస్తే పోలీసులకు ఫిర్యాదులు చేయాలన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపు

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసిందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రెండులక్షల రుణమాఫీ చేశారని అన్నారు. వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ కాకుండా ఎవరైనా రైతులు ఉంటే వారికి కూడా అమలు చేస్తారని తెలిపారు. జిల్లాలోని మండల వ్యవసాయ శాఖ అధికారులు, తహశీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. అర్హులైన అందరి రైతులకు ఈ రుణమాఫీ చేస్తున్నారని అన్నారు. కొంత మంది రైతులకు రెండులక్షలకు పైగా రుణం ఉందన్నారు. వారు మిగతా డబ్బులను బ్యాంకులకు డిపాజిట్ చేస్తే వారి రుణం కూడా మాఫీ చేస్తారని తెలిపారు. కొంత మందికి ఆధార్, రేషన్ కార్డులో తప్పులు దొర్లడం వల్ల కాలేదని వాటిని కూడా సరిచేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం మొత్తం రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. కొన్ని పార్టీల నేతలు కావాలనే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసమే ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలను ఇచ్చి నెరవేరుస్తుందన్నారు. ఆర్థికంగా ప్రభుత్వానికి ఇబ్బందులు ఉన్నా అన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. రుణమాఫీ కాని రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తగిన ధ్రువీకరణ పత్రాలు అందిస్తే వారివి కూడా పరిశీలించి మాఫీ చేస్తారని ఆయన తెలిపారు.



అనురాగ బంధం

- నేడు రాఖీ పౌర్ణమి

- జిల్లాలో రాఖీ సందడి
- కొనుగోళ్లతో సందడిగా మారిన జిల్లా కేంద్రం
- మహిళలతో కిటకిటలాడిన దుకాణ సముదాయాలు



నగరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 18: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను జిల్లాలో సోమవారం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో సందడి నెలకొంది. దుకాణ సముదాయాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. రాఖీలను కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలు, యువతులు, చిన్నారులను ఆకర్షించేలా వ్యాపారులు అందమైన రాఖీలను మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధం చేశారు. అలాగే మిఠాయి దుకాణాలలో సైతం కొను గోలుదారులతో సందడి నెలకొంది. హిందూ సంప్రదాయంలో సోదర సోదరీల ఆత్మీయతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శ్రావణమాసంలో వచ్చే నాగుల పంచమి శ్రావణ పౌర్ణమి రోజున ఆత్మీయతకు అద్దం పడుతోంది. ఈ రోజున సోదరులకు సోదరీ రక్షగా ఉండాలని రక్షను కట్టడం జరుగుతుంది. నాగుల పంచమి రోజున ఈ వేడుకను నాగదేవతలను పూజించి కళ్లు కడగడం ఎంత ప్రాధాన్యం ఇస్తారో.. రక్షాబంధన్ రోజు అంతే ప్రాధాన్యతను ఇస్తూ వేడుకలు జరుపుకుంటారు. సోదరీ సోదరుడికి రక్షను కట్టిన తర్వాత బహుమతిని అందుకోవడం పండుగను ప్రత్యేకతగా భావిస్తారు. పలు ప్రాంతాల్లో సోదరీకి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఆశీస్సులను అందుకుంటారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదర భావంతో ప్రేమానురాగంతో ప్రతీ సంవత్సరం శ్రావణ మాసం పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకుంటూ జరుపుకొనే వేడుక అని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ఔన్నత్యాన్ని యావత్తు ప్రపంచానికి చాటుతున్న పండుగ అని అన్నారు.





సంక్షేమ వసతి గృహాలపై పర్యవేక్షణ కరువు!

ఇష్టారాజ్యంగా హాస్టళ్ల నిర్వహణ

- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని భోజనం
- ఏసీబీ తనిఖీల్లో బయటపడిన పలు అవకతవకలు
- ఒక్కొక్కరికి రెండేసి హాస్టళ్ల నిర్వహణ బాధ్యతలు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 18: జిల్లా సంక్షేమ వసతి గృహాలపై పర్యవేక్షణ లేదు. అధికారుల తనిఖీలు లేవు. పట్టించుకునే వారు లేక ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించడం లేదు. ఈ విషయాలు జిల్లాలో ఈ మధ్యనే ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో బయటపడగా అధికారుల పర్యవేక్షణలోపం వెలుగులోకి వచ్చింది. వసతిగృహాలకు పూర్తిస్థాయి వార్డెన్‌లను నియమించకపోవడం వల్ల కొన్ని ఇన్ చార్జిలతోనే కొనసాగుతున్నాయి. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్‌ల దే హవా కొనసాగుతోంది. ఇటీవల ఏసీబీ అధికారులు జిల్లా కేంద్రంలోని కోటగల్లీ బాలికల సంక్షేమ వసతి గృహంలో నిర్వహించిన తనిఖీల్లో అనేక అక్రమాలు బయటపడ్డాయి. విద్యార్థులకు ఇచ్చే అలవెన్సు, భోజనం అందించే సామగ్రిలో వార్డెన్లు చేతివాటం ప్రదర్శిస్తోంది. విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపి దొంగ బిల్లులు పెట్టి లక్షలాది రూపాయలు నొక్కేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నాణ్యతలేని వస్తువులను తక్కువ ధరకు కొనుగోలు చేసి విద్యార్థులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 55 ప్రీమెట్రిక్, 29 పోస్ట్ మెట్రిక్, 3 ఆశ్ర మ్ స్కూల్స్ ఉండగా, మొత్తం సుమారు 10వేల వరకు విద్యార్థులు ఉన్నారు. వార్డెన్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రెగ్యులర్ వార్డెన్‌లకే ఒకటి, రెండు వసతిగృహాలకు ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించారు.


రెగ్యులర్ వార్డెన్లు లేక ఇక్కట్లు

జిల్లాలో ఉన్న సంక్షేమ వసతిగృహాలకు రెగ్యులర్ వార్డెన్లు లేక పర్యవేక్షణ కరువైంది. సాంఘిక సంక్షేమ ప్రీమెట్రిక్ వసతిగృహాలు 32 ఉండగా, 19 మంది మాత్రమే రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. మిగతా 13 హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్లు కొనసాగుతున్నారు. 10 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు 10 మంది రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. వీరిలో కొంత మందిని ప్రీ మెట్రిక్ హాస్టళ్ల ఇన్‌చార్జులుగా నియమించారు. కమ్మర్‌పల్లి ప్రీమెట్రిక్ వసతిగృహంమూసివేయగా అక్కడి వార్డెన్ మారుతిని డిచ్‌పల్లి వసతి గృహానికి ఇన్‌చార్జిగా నియమించారు. సిరికొండ బాలుర వసతిగృహానికి రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను ఇన్‌చార్జిగా నియమించారు. ధర్పల్లి, సిర్నాపల్లి హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడంతో ఇందల్వాయి వార్డెన్ దేవేందర్‌కు ధర్పల్లి, నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల వద్ద ఉన్న బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ నవీన్‌కు సిర్నాపల్లి ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. నందిపేట రెగ్యులర్ వార్డెన్ కిషన్‌కు అయిలాపూర్ ఇన్‌చార్జి, ఆర్మూర్ రెగ్యులర్ వార్డెన్ సుమలతకు మోర్తాడ్ బాలికల వసతి గృహం, మోర్తాడ్ రెగ్యులర్ బాలుర వసతి గృహం వార్డెన్ సాయికుమార్‌కు చౌట్‌పల్లి ఇన్‌చార్జి, తొర్లికొండ బాలుర హాస్టల్ వార్డెన్ సంతోష్‌కు ఏర్గట్ల ఇన్‌చార్జిగా, వేల్పూర్ బాలుర వసతిగృహం వార్డెన్ ప్రవీణ్‌కుమార్‌కు భీమ్‌గల్ ఇన్‌చార్జిగా, నిజామాబాద్ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహం వార్డెన్ నవనీతకు కోనసముందర్, భీమ్‌గల్ బాలికల వసతిగృహాల ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. ఎడపల్లి బాలుర వసతిగృహం వార్డెన్‌క నవీపేట ఇన్‌చార్జిగా ఇచ్చారు. బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 19 ఉండగా 12 మంది రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. ఏడుగురు ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. నిజామాబాద్ కోటగల్లీ బాలికల వసతిగృహం వార్డెన్ రాధారాణికి రెంజల్, నిజామాబాద్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహం వార్డెన్ బాలకృష్ణకు మాక్లూర్, నవీపేట హాస్టళ్ల ఇన్‌చార్జీలుగా నియమించారు. బాల్కొండ పోస్ట్‌మెట్రిక్ బాలికల హాస్టల్ వార్డెన్ వాణికి అక్కడి ప్రీమెట్రిక్‌తోపాటు నిజామాబాద్ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతిగృహం ఇన్‌చార్జిగా ఇచ్చారు. డిచ్‌పల్లి పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వార్డెన్ లక్ష్మణ్‌కు భీమ్‌గల్ ప్రీ, పోస్ట్‌మెట్రిక్ ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు. బోధన్ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వార్డెన్ చంద్రశేఖర్‌కు చందూర్ ప్రీమెట్రిక్ బాధ్యతలు అప్పగించారు. గిరిజన వసతిగృహాల విషయానికొస్తే ఆర్మూర్ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌కు సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ సురేశ్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు.

పట్టించుకోని వార్డెన్లు

గతేడాది నగరంలోని హమాల్‌వాడీ గిరిజన వసతిగృహం విద్యార్థులు భోజనం సక్రమంగా పెట్టడం లేదని రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేశారు. ఇన్‌చార్జిలుగా ఉన్న వార్డెన్లు వసతిగృహాలను తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. కొంతమంది వార్డెన్లు విధులకు వెళ్లకుండా కింది స్థాయి సిబ్బందితోనే వ్యవహారాలను నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొంత మంది హాస్టళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇంటి నుంచే పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలుస్తోంది. సాంఘిక సంక్షేమ వసతి గృహాలల్లో గతంలో అక్రమాలు జరిగినట్లు విద్యార్థి సంఘాలు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాయి. ఇటీవల బదిలీ అయిన సాంఘిక సంక్షేమ అధికారిని అక్రమాలకు ఊతం ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన అభ్యర్థులకు ఇచ్చే వసతులలో అప్పటి డీఎస్‌డీవో శశికళ తనకు అనుకూలంగా ఉన్న వార్డెన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఎస్సీ స్టడీ సర్కిల్ అక్రమాలల్లో సదరు వార్డెన్ పాత్ర కీలకంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ తనిఖీలతో కొన్ని వసతిగృహాల వార్డెన్‌ల అక్రమాలు బయటపడినా ఇంకా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.








అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవీపేట, ఆగస్టు 18: మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట కాలనీకి చెందిన ముత్యమ్మ అనే మహిళ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో మీకోసం మేము సేవ సంస్థ ఆద్వర్యంలో 8వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సంస్థ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన పలువురు యువకులు సైతం మరో 6వేల రూపాయల విరాళాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో మహిపాల్, మోహన్, రాజు, శ్రావణ్, కృష్ణ, తదితరులున్నారు.







రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లావాసికి బంగారు పతకాలు


మిట్టపల్లి రిత్విక

నవీపేట, ఆగస్టు 18: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ ఫుల్‌లో ఆదివారం జరిగిన 9వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్ షిప్-2024 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో మండలంలోని బినోలకు చెందిన మిట్టపల్లి రిత్విక మూడు బంగారు పతకాలను సాధించింది. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 50మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, వంద మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, 200మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం సాధించి కర్నాటకలోని మంగళూరులో సెప్టెంబర్ 10నుండి 13వరకు జరిగే 77వ నేషనల్ అక్విటిక్ చాంపియన్ షిప్ 2024 పోటీలలో పాల్గొనడానికి మిట్టపల్లి రిత్విక అర్హత సాధించింది. రాష్ట్రస్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపికైన మిట్టపల్లి రిత్వికను తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు మైపాల్ రెడ్డిలు అభినందించారు.

జిల్లాస్థాయి చెస్ ఎంపికలు పూర్తి

సుభాష్‌నగర్, ఆగస్టు 18: జిల్లాస్థాయి అండర్-11 చెస్ ఎంపికలు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడా మేధాశక్తిని పెంచుతుందన్నారు. అనంతరం ఈ పోటీలలో విజేతలైన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. బాలుర విభాగంలో అభిజిత్, అత్వర్ తోర్వే, బాలికల విభాగంలో నాగజ్యోత్స్నిక, సహస్ర రాథోడ్‌లు విజయం సాధించారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్

సుభాష్‌నగర్, ఆగస్టు 18: ధర్మసమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా మంగ్లారం మహిపాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిపాల్ గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ విశారాధన్ మహారాజ్ భావజాలాన్ని జిల్లాలో వ్యాప్తి చేస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం విశారాధన్ మహారాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో డీఎస్‌పీని విస్తృతం చేసి పేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



ఖిల్లా, ఆగస్టు 18: వాహనదారులు వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పకుండా ధరించాలని నాల్గవ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదేశాల మేరకు నగర ఇన్స్‌పెక్టర్ నరహరి నేతృత్వంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే పరిణామాల గురించి వివరించారు. ఈ అవగాహన సదస్సులో పోలీసులు పాల్గొన్నారు.







దోషులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్


సిరికొండలో రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నేతలు



క్యాండిల్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న స్టూడెంట్ యూనియన్ సభ్యులు

పెద్దబజార్, ఆగస్టు 18: పశ్చిమబెంగాల్‌లో ఆర్జికర్ కళాశాల వైద్యురాలు అత్యాచార ఘటన దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైద్యురాలికి సంబంధించిన అత్యాచార ఘటన కేసు విచారణ వెంటనే పూర్తి చేయాలని దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఒక మెట్రోపాలిటన్ నగరంలో ఉన్న వైద్య కళాశాలలో ఇంత పెద్ద ఘటన జరగడం సమాజంలో మహిళలకు రక్షణ లేదని అనడం నిదర్శనమన్నారు. కేవలం అత్యాచార ఘటన మాత్రమే కాదని ఇది మరో నిర్భయ ఘటన అని అన్నారు. అత్యాచారానికి గురైన వైద్యురాలు ప్రతిఘటించిన క్రమంలో ఆమెపై విపరీతమైన దాడి జరిగిందని సామూహికంగా అత్యాచారం జరిగినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది కనుక సిబిఐ వెంటనే దర్యాప్తును పూర్తిచేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ చేపట్టాలన్నారు. దేశంలో అనేక చోట్ల వైద్య సిబ్బందిపై దాడులు జరుగుతున్నాయని అత్యా చార ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు మౌనిక, లక్ష్మి, మమత, సరిత,తదితరులు పాల్గొన్నారు.

● హత్యాకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి

సిరికొండ: కలకత్తాలోని ఆర్ జీ కార్ వైద్యకళాశాల జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం , హత్యాకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం సిరికొండలో ప్రజా సంఘాల నేతలు రాస్తారోకో చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రగతిశీల మహిళ సంఘం, పీడీఎస్‌యూ.పీవైఎల్ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం సిరికొండ తెలంగాణ చౌరస్తాలో రాస్తారోకో చేసి నిందితుల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మృతురాలికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళ సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు రమా మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యా చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శిక్షణ పొందుతున్న డాక్టర్ విధులు నిర్వర్తించుచుండగా నిందితులు పాశవికంగా అత్యాచారం చేసి చంపివేయడం హేయమైన చర్య అని ఆమె ఖండించారు. దోషుల్ని పట్టుకుని కఠినంగా శిక్షించాల్సింది పోయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరోకరు నిందించుకోవడం సిగ్గు చేటన్నారు.జూనియర్ వైద్యురాలి ఘటనను బీజేపీ రాజకీయంగా వాడుకోవడానికి యత్నించడం విడ్డూరంగా ఉందన్నారు.సభ్య సమాజం తలదించుకునేల జరిగిన సంఘటనను మానవత్వం ఉన్న ప్రతీ ఒక్కరు ఖండించాలని రమా కోరారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఒకర్ని మరొకరు తిట్టు కోవడం మాని దోషలకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని రమా కోరారు. ఈ కార్యక్రమంలో అనీస్,ఆశీష్, పీవోడబ్ల్యూ నాయకులు ఈ.జమున,మానస,లక్ష్మి,లతా,లతిక,ప్రమీల,స్వరూప,తస్లీన్‌బేగం,ప్రేమ్‌కుమార్,రుషి వర్దన్,దామోదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెర్కిట్‌లో క్యాండిల్ ర్యాలీ

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తాలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లోని వైద్యవిద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఇలాంటి సంఘటనలు దేశంలో పునరావృతం కాకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాహిద్, ఆయన్, ఇర్షాద్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

● అత్యాచారం చేసి హత్య చేసిన దుండగుల్ని వెంటనే శిక్షించాలి

మోర్తాడ్: కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిని దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన వెంటనే శిక్షించాలని ప్రజాపంథ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మోర్తాడ్‌లో ఆయన వికరులతో మాట్లాడారు. ట్రైనీ డాక్టర్‌ను పాశవికంగా హించి అత్యాచారం చేసి హత్య చేయడం సిగ్గుచేటని అన్నారు. నిందితులను కేంద్ర ప్రభుత్వం పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని అన్నారు. సమాజంలో తలదించుకునేలాగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కావోద్దని అన్నారు. ఈ సమావేశంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు సత్తెక్క, జమున, ఏఐటీకె, ఎంఎస్ డివిజన్ నాయకులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● కామాంధులను కఠినంగా శిక్షించాలి

బోధన్‌రూరల్: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై పైశాచికంగా హత్యచేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళ సంఘం అధ్యక్షురాలు బి.నాగమణి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన కామాంధుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ రాత్రి డ్యూటీ చేస్తున్న సమయంలో కొంతమంది సామూహికంగా కామాంధువులు అత్యాచారం చేసి హత్య చేశారని అట్టి ఘటనపై విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ పట్టణ నాయకురాలు అరుణ, యాదమ్మ, గంగామణి, లక్ష్మి, మణెమ్మ, సావిత్రి, మౌనిక, ఏఐకేఎంఎస్ నాయకులు పడాల శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

● అత్యాచారం చేసిన ఘటనపై విచారణ జరిపించాలి

ఆర్మూర్‌రూరల్: కలకత్తా వైద్యశాల విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటనలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్; ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలో వైద్యశాల విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనను ప్రతీఒక్కరు తీవ్రంగా ఖండించాలన్నారు.


మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ప్రజాపంథ నాయకులు


బోధన్‌లో కామంధుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పశ్చిమబెంగాల్ అధికార పార్టీకి చెందిన కొందరు వైద్యవిద్యార్థినిపై అత్యాచారం జరిపి హత్య చేసిన సంఘటన మానవ సమాజం తలదించుకునేలా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన కొన్ని గంటల్లోనే దుండుగులు ఆసుపత్రిపై దాడి చేసి సాక్ష్యాలు దొరకకుండా చేసే ప్రయత్నం చేశారన్నారు. ప్రజలకు సేవ చేసే డాక్టర్‌లకే రక్షణ లేకుండా పోయిందన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాల్సింది పోయి రాజకీయ లబ్ధికొరకు సీఎం మొసలికన్నీరు కార్చడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకు దేశవ్యాప్త ఉద్యమం చేస్తున్న వైద్యులకు, ఐఎంఏ ప్రతినిధులకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ మాస్‌లైన్ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఐక్యంగా ఉద్యమిద్దామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎం.ముతె న్న, సంయుక్త కార్యదర్శి కిషన్, శేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డెర ఒబాన్న విగ్రహావిష్కరణ


ఆర్మూర్‌లో ఒడ్డెర ఒబాన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు18:పట్టణంలోని 2వ వార్డు ఒడ్డెరకాలనీలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి ఆదివారం వడ్డెర ఒబా న్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ బ్రిటిష్ వారిపై వీరోచిత పోరాటం చేసిన యోధుడని ఉయాల వాడ నర్సింహారెడ్డి చేసిన సహసోపేతమైన పోరులో సైనిక అధ్యక్షుడి గా నర్సింహారెడ్డి కుటుంబాన్ని ప్రజలు కాపాడిన స్వాతంత్ర్య సమర యోధుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషకరమైన విషయ మని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, అయ్యప్ప శ్రీనివాస్, ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, ఆకుల రాము, రహమన్, గండికోట రాజన్న, ఖాందేశ్ సత్యనారాయణ, వడ్డెర సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దొంగ ధర్నాలు రైతులు పట్టించుకోవద్దు

● బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్



మోర్తాడ్‌లో సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మోర్తాడ్ ఆగస్టు18: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే పని చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న బూటకపు ధర్నాలను రైతులు, ప్రజలు పట్టించుకోవద్దని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మోర్తాడ్‌లోని ప్రజా భవనంలో విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాకుండానే మూడో విడత రుణమాఫీ రాక ముందే రుణమాఫీ కాలేదని ధర్నాలు చేస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల వైఖరిని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. రుణామాఫీ ప్రక్రియ పూర్తికాక ముందే ధర్నా పేరుతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, సునీల్‌కుమార్ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న వారికి లక్షల రుణమాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వం రుణమాఫికి రూ.31వేల కోట్లు కేటాయించిందని, ఇప్పటికీ రూ.18వేల 500కోట్ల రుణమాఫీ జరిగిందని, రూ.12వేల 500కోట్ల రుణమాఫీ జరగాల్సి ఉందని, బ్యాంకు టెక్నికల్ సమస్యల వల్ల కొంత మందిరి రుణమాఫీ కాలేదని, రేషన్‌కార్డు లేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల 50వేల కుటుంబాలకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. రైతులు అధైర్యపడవద్దని, అందరికి రుణమాఫీ జరుగుతుందని, దొంగ ధర్నాలకు వెళ్లొద్దని సునీల్‌కుమార్ కోరారు. ప్రశాంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అని, పదేళ్ల ఏలుబడిలో బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు చేసిందేమి లేదన్నారు. రివర్స్ పంపింగ్ పేరుతో వంద కోట్ల కమిషన్ తిని ఎన్నికల్లో వేల రూపాయలు తెచ్చి ఏదో సాధించారని భ్రమపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని రైతులకు అన్ని విధాల ఆదుకుంటుందని సునీల్‌కుమార్ అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, దేవారెడ్డి, రాజేశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత బీమా చెక్కు అందజేత

బోధన్ రూరల్, ఆగస్టు 18 : బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు ఆదివారం బీమా చెక్కును అందజేశారు. బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్ కాలనీకి చెందిన నాగేశ్వర్ నాగనాథ్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పాలసీ కట్టారని, గత డిసెంబర్ నెలలో పాలసీదారుడు మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు ఆదివారం ఈడీ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా 8.30లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హన్మంత్ రావు, ఏజీఎం సతీష్ కుమార్, డీఎం నగేష్, ఏఎం శ్రీనివాస్, ఉద్యోగులు మురళీ, సౌందర్య, రాధాశ్రీ, దిలీప్ పటేల్, సాయిబాబా, లింగారెడ్డి తదితరులున్నారు.

‘ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి’

డిచ్‌పల్లి, ఆగస్టు 18 : ద్విచక్రవాహనదారులు బైకు నడుపుతున్న సమయంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ సూచించారు. ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని, కోరట్‌పల్లి గ్రామంలో హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకంతో ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. తలకు రక్షణగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ నాణ్యతతో కూడిన హెల్మెట్‌ను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

‘సైబర్ నేరాలపై అవగాహన అవసరం’

బోధన్ : ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌లు ధరించాలని బోధన్ పట్టణ సీఐ వీరయ్య, రూరల్ సీఐ నరేష్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, శక్కర్‌నగర్ చౌరస్తా ప్రధాన కూడళ్లలలో, రూరల్ సీఐ కోలా నరేష్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో హెల్మెట్‌ల గురించి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను మోసం చేయడానికి కొంతమంది అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్‌లతో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దు’

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 18 : రైతు రుణమాఫీపై వివిధ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జితేందర్‌రెడ్డి, బాబీలు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి రూ.32వేల కోట్లు కేటాయించగా సుమారు రూ.18వేల కోట్లు విడుదల అయ్యాయని, కొన్ని సాంకేతిక లోపాలతో కొంత మందికి రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే సాంకేతిక లోపాలను సరి చేసి రుణమాఫీ జరుగుతుందని సూచించారు. తొమ్మిది నెలల కాలంలోనే రైతులకు రుణమాఫీ చేస్తున్నామని, సంవత్సరాలు గడిచిన రూ.లక్ష రుణమాఫీ చేయలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పుడు సమాచారం అందిస్తుందని, రైతులు నమ్మవద్దని వారు కోరారు.

‘లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ’

పెద్దబజార్, ఆగస్టు 18 : దేశానికి కమ్యూనిస్టులు లౌకిక శక్తులతోటే ప్రజాస్వామ్య రాజ్యాంగ రక్షణ సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో హన్మకొండలో సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజన్న, రాజరెడ్డి, భాను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, పది తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 18: ఈ విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ ఇంటర్, పది తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెద్ద కొడప్‌గల్ ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కిషోర్ తెలిపారు. ఏ తరగతి చదివిన వారైనా పదికి అర్హులని, పదో తరగతి పాసైన వారు ఇంటర్‌కు అర్హులని తెలిపారు. ఈ నెల 8న ప్రారంభమైన ప్రవేశాలు ఎలాంటి అపరాధరుసుము లేకుండా సెప్టెంబర్ 10 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల పనివేళల్లో గాని 9866343898 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వర్ని-కోటగిరి రోడ్డుకు మహర్దశ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వర్ని, ఆగస్టు 18 : ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 4న ప్రచురితమైన ప్రమాదాలకు అడ్డాగా వర్ని-కోటగిరి రహదారి వార్తకు ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. నాన్ ప్లాన్ నిధులు రూ.1.50 కోట్ల వ్యయంతో మొదటి దఫా విడతలో 12వందల మీటర్ల డబుల్ రోడ్డు విస్తరణ బీటీ రోడ్డు కోసం ఆదివారం చర్యలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ నిబంధనల ప్రకారం వర్ని మండల కేంద్రంలోని మహిళ మండలి భవనం నుంచి నిర్మాణ పనుల వరకు రోడ్డు ఆక్రమణకు గురైందని, అందుకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి చర్యలు చేపడుతామని డీఈ వెల్లడించారు. మూడునెలల్లో ప్రస్తుత నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుత డబుల్ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా విస్తరించి బీటీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. మిగతా రోడ్డు విస్తరణ కోసం ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ డీఈతో పాటు ఏఈ జీవన్ స్థానిక నాయకులు పెనుమర్తి శ్రీహరి పర్యవేక్షించారు. ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోక పలువురు ప్రాణాలు కోల్పోయ్యారని స్థానికులు గుర్తు చేశారు. ఆంధ్రజ్యోతి కథనంతో రహదారి నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ అధికారులు వేగవంతం చేయడం శుభపరిణామంగా కోటయ్య క్యాంపు, తగిలేపల్లి, అంబం, రాంపూర్, కోటగిరి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


కొనసాగుతున్న పనులు

‘రుణమాఫీతో రైతులకు అండ’


మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి

కమ్మర్‌పల్లి ఆగస్టు 18 : అగస్టు 15 వరకు రెండులక్షల రూపాయల రుణమాఫీ చేసితీరుతామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రైతుబాంధవుడు సీఎం రేవంత్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం కమ్మర్‌పల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలస్థాయి కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. పదేళ్ల పాలనలో రైతులను నిట్టనిలువున ముంచిన చరిత్ర బీఆర్‌ఎస్ పాలకులదన్నారు. రైతు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధరలు అందించక పోగా, కేసీఆర్ 12 వందల మంది రైతుల ఆత్మహత్యలకు కారకుడయ్యారని విమర్శించారు. ఏక కాలంలో లక్ష రుణమాఫీ అని చెప్పి మాటతప్పిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదికాదా అని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దేనన్నారు. అది తట్టుకోలేక ఉనికిని కాపాడుకోవడానికే ధర్నాలతో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతుద్రోహులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులైతే రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తు రైతులను ఆదుకునే రైతుబాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రెండులక్షల రుణమాఫీ మాటిచ్చి అమలు జరుపుతూ రైతుల ముఖాల్లో ఆనందాన్ని తేస్తున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీ సీం రేవంత్ రెడ్డిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రణమాఫీ కోసం 31 వేల కోట్ల నిధులు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ విడతలవారిగా రైతులఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదువందల బోనస్ సైతం రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఒక పక్క రుణమాఫీ జరుగుతుంటే మరోపక్క రుణమాఫీ జరగడంలేదని విమర్శించడం తగన్నారు. ఇది కేవలం రైతులను తప్పుదారి పట్టిచడానికే ధర్నాలు చేస్తున్నారని అన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో రుణమాఫీ రాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని సరి చేసి త్వరలోనే అందజేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్, డీసీసీ కార్యదర్శి తక్కూరి దేవేందర్, నాయకులు బుచ్చన్న, పాలేపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, బుచ్చిమల్లయ్య, కొమ్ముల రవిందర్, ఏనుగు మనోహర్, అజారోద్దీన్, గణేష్ గౌడ్, శేఖర్, పత్రి రవి, అశోక్, మారయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

రుద్రూరు, ఆగస్టు 18 : ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన అకాల్వర్ శాంత (56) అనే వృద్ధురాలు ఈనెల 13 నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మాక్లూర్ గౌడ సంఘం ఏర్పాటు

మాక్లూర్, ఆగస్టు 18 : సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా మండల గౌడ సంఘం సభ్యులు సమావేశమై మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో సమావేశామై వివిధ అంశాలపై చర్చించి కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షునిగా ఎం.నారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు భూమాగౌడ్, దశాగౌడ్ రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా నగేష్‌గౌడ్, గణేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, ప్రత్యేక సలహదారులుగా నారాగౌడ్, నర్సగౌడ్, లింబాగౌడ్, సతీష్ గౌడ్, సాయాగౌడ్, కార్యదర్శులుగా రాజుగౌడ్, గంగాగౌడ్, నారాగౌడ్, శేఖర్‌గౌడ్, రవీంధర్‌గౌడ్, కోశాధికారిగా రాజుగౌడ్, డైరెక్టర్‌లుగా మురళీగౌడ్, గంగాధర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, భూమాగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బుచ్చగౌడ్ ఎన్నుకున్నారు.

వర్షానికి కూలిన సిద్ధరామేశ్వరనగర్ వీడీసీ భవనం

భిక్కనూరు, ఆగస్టు 18: గతరాత్రి కురిసిన భారీవర్షానికి మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ వీడీసీ భవనం ఆదివారం తెల్లవారుజామున కూలింది. ఈ గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఈ భవనం కింది గదిలోనే గ్రామపంచాయతీ కొనసాగుతుంది. కాగా ఈ భవనం కూలిన సమయంలో ఈ భవనంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ భవనం నిర్మించనప్పటి నుంచి గ్రామాభివృద్ధిలో కొనసాగుతుండగా గత ప్రభుత్వంలో మరమతుల నిమిత్తం రూ.4 లక్షలు మంజూరు కాగా పనులు ఎవరు చేపట్టలేదు. ఈ భవనం శిథి వస్థకు చేరుకుందని చాలాసార్లు జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసు కెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి గ్రామాభివృద్ధి కమి టీకి నిధులు మంజూరు చేసి బాగు చేయించాలని గ్రామస్థులు ఈ సందర్భంగా కోరుతున్నారు.


కూలిన వీడీసీ భవనం

జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డాక్టర్ విశాల్

పెద్దబజార్, ఆగస్టు 18: ఆగ్రాలో జరిగిన మిడ్ ఇయర్ కాన్ఫరెన్స్‌లో జిల్లాకు చెందిన ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా వృత్తినైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీంతో పాటు మరిన్ని అంశాలపైన ప్రసంగించారు.

జాన్కంపేట్‌లో సర్వాయి పాపన్న జయంతి

వేల్పూర్, ఆగస్టు 18: వేల్పూర్ మండలం జాన్కంపేట్‌లో ఆదివారం గౌసంఘాల అద్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. సర్వాయిపాపన్న సబ్బండవర్గాల రాజకీయ సామాజిక సమానత్వని కృషిచేసిన వీరుడని, ఆయనలోని పోరాటపటిమను ధైర్యంను స్ఫూర్తిగా తీసుకొని గౌడ జాతి ఐక్యంగా ఉంటూ అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలని గౌడ సంఘం అధ్యక్షుడు శంకర్ గౌడ్ అన్నారు. గౌడవృత్తిని చేపట్టి విరమణ పొందిన బొమ్మకంటి నర్సాగౌడ్, జవ్వాజి గంగాధర్ గౌడ్‌లను శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘసభ్యులు శోబన్ గౌడ్, ఎల్లాగౌడ్, కిషోర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలో సెమీఫైనల్ చేరిన జిల్లా జట్టు

సుభాష్‌నగర్, ఆగస్టు 18 : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో నిజామాబాద్ జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం జరిగిన క్వాటర్ ఫైనల్ పోటీలలో నిజామాబాద్-మహబూబ్‌నగర్ జిల్లా జట్లు పోటీ పడగా నిజామాబాద్ జట్టు 6-0 తేడాతో సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఈ పోటీలో నిజామాబాద్ జిల్లా జట్టు తరఫున భారతజట్టు క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య-2, జాహ్నవి-2, సాయిసమీక్ష-1, సుశాంతిక-1 గోల్ సాధించి జట్టు సెమీ ఫైనల్ చేరడానికి కీలకపాత్ర పోషించారు. సోమవారం నిజామాబాద్-మెదక్ జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ పోటీలను ఏఆర్‌ఏసిపి నాగయ్య, సీనియర్ క్రీడాకారుడు జావిద్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జట్టు కోచ్ వక్త పాల్, మేనేజర్ అజ్మత్, అసిస్టెంట్ కోచ్ నాగరాజు పాల్గొన్నారు.

వివేక్‌నగర్ తండాలో ఘనంగా తీజ్ పండగ

జక్రాన్‌పల్లి, ఆగస్టు18: మండలంలోని వివేక్‌నగర్‌తండా గ్రామంలో తీజ్ పండగను గిరిజన మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వారం రోజుల నుంచి బుట్టలో గోదుమ మొలకలను పెంచారు. ఆదివారం తీజ్ పండగ సందర్భంగా తండా గ్రామ మహిళలు, గిరిజన మహిళలు గోదుమ మొలకల బుట్టలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తూ తీజ్ పండగ పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల మధ్య తీజ్ పండగను జరుపుకన్నారు. అనంతరం అనంతరం గోదుమ మొలకల చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం వనభోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో గిరిజన తాండా పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పర్వతాన్ని అధిరోహించిన నాళేశ్వర్ వాసి

నవీపేట, ఆగస్టు 18 : యూరప్ ఖండంలో ఎతైన ఎల్‌బ్రస్ పర్వతాన్ని మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతి అనే పర్వతారోహకుడు ఈ నెల 17న అదిరోహించాడు. ఈ నెల 10న రాష్ట్రంలోని మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు. మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతితో పాటు రష్యాకు చెందిన మరో ఐదుగురు కలిసి మొత్తం 8 మంది సభ్యులు ఈ ఎతైన పర్వతాన్ని అదిరోహించారు. ఆర్మూర్ మారుతి గత సంవత్సరం ఆగస్టు 15న ఆఫ్రికా ఖండంలోని ఎతైన కిలిమంజారో శిఖరం, ఈ సంవత్సరం ఏప్రిల్ మాసంలో మన దేశంలోని ఉత్తర సిక్కింలో ఉన్న మంచు పర్వతాన్ని అదిరోహించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ప్రస్తుతం రష్యాలో ఉన్న ఆర్మూర్ మారుతి ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ ఐరోపా ఖండం రష్యా దేశంలో ఎల్‌బ్రస్ అనే మంచు పర్వతాన్ని అదిరోహించడం తమకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ మారుతి ప్రపంచంలో ఎతైన శిఖరాలను అధిరోహించి రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు సంపాదించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్మూర్ మారుతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సహకాన్ని అందించాలని పలువురు కోరుతున్నారు. తాను స్వదేశం రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

రైతుల రుణ మాఫీతో బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన



కొండాపూర్‌లో పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ ఆగస్టు 18 : సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులు తీసుకున్న పంట రుణాలు రెండు లక్షల వరకు ఏకకాలంలో మాఫీ చేయడంతో బీఆర్ఎస్ నేతలకు ఏమిచేయాలో పాలుపోక రైతులను గందరగోళం పరుస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆరోపించారు. సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులు తీసుకున్న పంట రుణాలను దేశ చరిత్రలో ఏరాష్ట్ర ప్రభుత్వం చేయలేని విధంగా ఏకకాలంలో రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. దీంతో బీఆర్ఎస్ నేతలకు ఏమి చేయాలో పాలుపోక రైతులనుఎ గందరగోళ పరుస్తూ ఆందోళనలు చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎవరికైనా రుణాలు మాఫీ కాకపోతే మండలాల్లో ఉండే వ్యవసాయ శాఖ అధికారులను కలిసి దరఖాస్తులు ఇవ్వాలని వారందరికి ప్రభుత్వం రుణాలు మాఫీ అయ్యేల చర్యలు తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్పే మాటల్ని రైతులెవరు పట్టించుకోవద్దని ఎమ్మెల్యే కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, ఎర్రన్న, సంతోష్,శ్రీధర్,గౌసొద్దీన్, బాస్కర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, జనార్దన్, ముత్తెన్న, రాజేశ్వర్‌గౌడ్,శేఖర్‌గౌడ్, కిషోర్‌గౌడ్, మహేష్‌గౌడ్, చంద్రగౌడ్, శేఖర్‌గౌడ్,లింబాద్రి గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, బాల్‌రాజ్‌నాయక్, లింగం తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన జడ్పీ మాజీ చైర్మన్



చేపూర్‌లో బాధితులను పరామర్శిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు18: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో ఇటీవల పిచ్చి కుక్క దాడిలో గాయపడ్డ పలువురిని ఆదివారం జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పరామర్శించారు. బాధితులు వడ్ల నర్సయ్య, పోసాని, వేల్పూర్ నర్సయ్యలు పరామర్శించి వారితో మాట్లాడారు. ఒకేరోజు పిచ్చికుక్క తొమ్మిది మందిని గాయపర్చిందని వారు విఠల్‌రావుకు వివరించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రభుత్వం వాటిని నివారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట చేపూర్ మాజీసర్పంచ్ కుస్తపురం గంగారెడ్డి, గంగామోహన్, నవీన్, రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.

మురికి కాలువలో శిశువు లభ్యం

● విచారణ జరుపుతున్న పోలీసులు



మృతి చెందిన శిశువు

ఖిల్లా, ఆగస్టు18: నగరంలోని ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల రైల్వేస్టేషన్ సమీపంలో మురికి కాలువలో మృతి చెంది ఉన్న శిశువును ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని ఒకటో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శిశువును మురికి కాలువలో నుంచి బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పుడే పుట్టిన శిశువును వద్దనుకున్న వారు అందులో పడేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. శిశువు గురించి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి



మృతుడు బాలాజీ

నవీపేట,ఆగస్టు18: ఫకీరాబాద్, బాసర రైల్వే స్టేషన్‌ల మధ్యన శనివారం అర్ధరాత్రి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ముత్రకర్ బాలాజీ(33)అనే వ్యక్తి మృతి చెందాడని రైల్వే ఎస్‌ఐ సాయిరెడ్డి తెలిపారు. బోధన్ ఆటోనగర్‌కు చెందిన బాలాజీ తన చెల్లెళ్ల పూజతో కలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో పుణా ప్యాసింజర్ ఎక్కగా ఫకీరాబాద్, బాసర స్టేషన్‌ల మధ్యన అతడు రైలు నుంచి జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయని వెంటనే లోకో పైలెట్ రైలును నిలిపివేయగా బాధితుడిని అదే రైలులో బాసర రైల్వే స్టేషన్ తరలించడం జరిగిందని అన్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న 108సిబ్బంది అతనిని పరీక్షించగా బాలాజీ మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. రాఖీ పండుగ నిమిత్తం నాందేడ్‌లో ఉంటున్న తన అక్క వద్దకు చెల్లెళ్లతో కలిసి వెళ్తుండగా బాలాజీ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

బోధన్‌రూరల్,ఆగస్టు18: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ తహసీల్దార్ విఠల్, ఎస్‌ఐ రాజశేఖర్‌లు అన్నారు. శనివారం అర్ధరాత్రి, ఆదివారం ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. పట్టుకున్న నాలుగు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్ధరాత్రి ఇసుక రవాణా చేయవద్దని వారు హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు18: ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజాగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి హాజరై సర్దార్‌పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొగల్ పాలకుల కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న భూస్వాముల దొరల గుత్తాధిపత్యాన్ని ఎదురించి 12వేల మంది సైన్యంతో గోల్కొండ కోటను ఏలిన బహుజన వీరుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్, వైస్ చైర్మన్ షేక్ మున్న, మాజీ వైస్‌చైర్మన్ లింగాగౌడ్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబాగౌడ్,లింబాద్రిగౌడ్, నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో

పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం పక్కన రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద పట్టణగౌడసంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు సాయిబాబాగౌడ్, రమేష్‌గౌడ్,లింగాగౌడ్, ప్రకాష్‌గౌడ్, సత్యనారాయణగౌడ్,ప్రశాంత్‌గౌడ్, పృధ్వీరాజ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో

పట్టణంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, కృష్ణగౌడ్,మోహన్‌రెడ్డి, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● దేగాంలో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

ఆర్మూర్‌రూరల్: ఆలూరు మండలం దేగాం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం సభ్యులు సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసినివాళుల అర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, తిరుమలగౌడ్, శంకర్‌గౌడ్, వెంకటరమణగౌడ్, యాదాగౌడ్, రామాగౌడ్ పాల్గొన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, రాకేష్ గౌడ్,గోపి, నరేశ్, మదు, మహేష్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు..

● నవీపేటలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

నవీపేట: గౌడ జాతి ముద్దుబిడ్డ, బహుజన నాయకుడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్ గౌడ్, గంగాధర్ గౌడ్, రవిచందర్ గౌడ్, శేఖర్ గౌడ్, మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఉప్లూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలో సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఆయా గ్రామాల గౌడసంఘం సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉప్లూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని పురస్కరించుకుని స్థానిక గౌడ సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఊట్నూర్ రవిగౌడ్, హరీష్ గౌడ్, రంజీత్‌గౌడ్, సాయాగౌడ్, సదాశివ్‌గౌడ్, రాజేశ్వర్, శేఖర్‌గౌడ్, భానుగౌడ్, రవితేజా గౌడ్, రాహుల్‌గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో..

● ధర్పల్లిలో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

ధర్పల్లి:మండల కేంద్రంలో సర్వాయి పాపన్న జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు.ఈసందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, లాలాగౌడ్, శ్రీనివాస్, సంతోష్‌గౌడ్, దిగంబర్,నరేందర్, దేవేందర్‌గౌడ్, నర్సాగౌడ్, గంగాధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● సర్వాయి పాపన్న అడుగు జాడల్లో ముందుకు పోవాలి

పెద్దబజార్: యువత సర్దార్ సర్వాయి పాపన్న అడుగు జాడల్లో ముందుకు పోవాలని ఆశయాల కోసం పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని బిజెపి ఓబిసి ఆధ్వర్యంలో సర్దార్ పాపన్నగౌడ్ 374వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్దార్ పాపన్నగౌడ్ 1650 ఆగస్టు 18న ప్రస్తుత జనాగమ జిల్లా రఘునాథపల్లె మండలంలోని కిలాసపూర్ గ్రామంలో ధర్మన్నగౌడ్-సర్వమ్మ దంపతులకు జన్మించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామియాదవ్, జిల్లా నాయకులు నాగరాజు, లక్ష్మినారాయణ, పల్నాటి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో గౌడ సంఘం, గీత పనివారాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గౌడ జాతి ముద్దుబిడ్డ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం భవనంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గంగాప్రసాద్, శంకర్ గౌడ్, అరుణ్ కుమార్, వెంకాగౌడ్, శ్రీధర్ గౌడ్, రాజాగౌడ్, సురేష్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఏర్గట్లలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

ఏర్గట్ల: మండల కేంద్రంతో పాటు తొర్తి గ్రామంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే తొర్తి గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని గౌడ సంఘ సభ్యులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బత్తుల చిన్న గంగారాం, తుపాకుల నారాగౌడ్, తుపాకుల శ్రీనివాస్‌గౌడ్, కోల రమేష్, ప్రదీప్‌గౌడ్, కోల రాజేందర్, సతీష్‌గౌడ్, రాజ్‌కుమార్, ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు

● మోర్తాడ్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

మోర్తాడ్:మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత సర్దార్ పాపన్నగౌడ్ భారీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రధాన వీధులగుండా గౌడ సంఘ సభ్యులు ఊరేగింపు నిర్వహించారు. అనం తరం ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్, ఆర్మూర్ డివిజన్ గౌడ సంఘం అధ్యక్షుడు కోటగిరి రామాగౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు అశోక్‌గౌడ్‌లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గౌడ్‌లు ఐక్యమత్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దమనుషులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● రుద్రూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

రుద్రూరు: మండల కేంద్రంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఠల్‌గౌడ్,శ్రీనివాస్‌గౌడ్,రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్ పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దేగాం యాదాగౌడ్



దేగాంలో పాపన్న జయంతి నిర్వహిస్తున్న గౌడ సంఘ సభ్యులు



ధర్పల్లిలో సర్వాయి పాపన్న జయంతిలో పాల్గొన్న గీత కార్మికులు



కోటగిరిలో పాపన్న జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

● లంగ్డాపూర్‌లో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఎం. గంగాధర్ గౌడ్, సుధాకర్ గౌడ్, శంకర్ గౌడ్ తదితరులున్నారు.

● తొర్లికొండలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

జక్రాన్‌పల్లి: మండలంలోని జక్రాన్‌పల్లి, తొర్లికొండ గ్రామాల్లో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ కులస్థులు ఘనంగా జరుపుకున్నారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు ఈ సందర్భంగా సర్దార్ పాపన్నగౌడ్ గౌడ కులస్థులకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ భూమేశ్వర్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు..

మంత్రి ఆదేశాలతో అటవీ భూముల పరిశీలన



అటవీభూమి మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సిరికొండ ఆగస్టు 18 : మంత్రి సీతక్క ఆదేశాలతో జంగిలోడి తండా పరిధిలోని అటవీ భూములను జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు.అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మ్యాపులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఎఫ్‌ఆర్‌సీ పట్టాలు లేకుండా అడవులను నరికివేస్తే ఇబ్బందులు పడేది మీరే అవుతారని గిరిజనులకు సూచించారు. పట్టాలు లేకుండ చెట్లను నరికివేసి పంటలు వేయొద్దని ఆయన సున్నితంగా హెచ్చరించారు. కేసులు, జైలుకు వెళ్లడం ఎందుకని ఆయన గిరిజనులను ప్రశ్నించారు. అటవీ శాఖ వారి వద్ద టైమ్‌లైన్ వీడియోలు,పోటోలు ఉంటాయన్నారు. తమకు పట్టాలిచ్చిన తర్వాత పంటలు సాగుచేస్తున్నట్లు గిరిజనులు అదనపు కలెక్టర్‌కు చెప్పుకున్నారు. అడవులు తగ్గిపోవడం వల్ల వర్షాలు కురువడం లేదనేది జగమెరిగిన సత్యం కదా అని అదనపు కలెక్టర్‌చెప్పారు. వాస్తవంగా 2005 లోపు సాగులో ఉంటే కచ్చితంగా ఎఫ్ఆర్‌సీ పట్టాలు వస్తాయన్నారు. అడవులను అనవసరంగా పోటీ పడి నరికివేయొద్దన్నారు.నంబర్‌లేని ట్రాక్టర్ల వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ క్షేత్ర అధికారి అనిత ఆధ్వర్యంలో సిబ్బంది సైతం తనిఖీ కోసం జంగిలోడి తండాకు వచ్చి కంపార్ట్ మెంట్ 397 లో భూమిని పరిశీలించారు.ఆక్రమనకు గురైన భూమి వివరాలను నోట్ చేసుకున్నారు.నివేదికను ఉన్నాతాదికారులకు నివేదిస్తానని అనిత చెప్పారు. అదనపు కలెక్టర్ వెంట సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు, సిరికొండ రేంజ్ అధికారి వినయ్‌నాయక్, డిప్యూటి రేంజ్ అధికారి గంగారాం,తదితరులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

● ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,ఆగస్టు18: మండలంలోని అబ్బాపూర్(ఎం) బస్టాండ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం హైదరాబాద్ నుండి బాసరకు వెళ్తున్న కారు అబ్బాపూర్(ఎం) బస్టాండ్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారికి ప్రైవేటు వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐదుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు వివరించారు. డ్రైవర్ నిద్రమత్తు మూలంగానే ఈ ప్రమాదం జరిగిందని వారు వివరించారు. ఈ విషయంపై ఎస్‌ఐ వినయ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.



అబ్బాపూర్(ఎం) సమీపంలో బోల్తా పడిన కారు

ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్




ధర్పల్లి రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్న బాజిరెడ్డి గోవర్దన్

ధర్పల్లి, ఆగస్టు 18: ప్రేమానురాగాలకు ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్ అని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోగల బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరభావం ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ కార్యక్రమం ఎంతో పవిత్రమైందని అన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే రక్షాబంధన్ ప్రపంచంలో ఎక్కడ లేదని ఇది కేవలం భారతదేశానికి మాత్రమే రక్షాబంధన్ సాధ్యమన్నారు. అన్నా చెల్లెల్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే పర్వదినం అని ఈ పర్వదినం యొక్క ఆధ్యాత్మిక రహస్యాన్ని తెలుసుకొని రక్షణ మరియు బంధనం అన్నారు. అనంతరం బ్రహ్మకుమారీలు బాజిరెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్లహన్మంత్‌రెడ్డి, మాజి సింగిల్ విండో చైర్మన్ కిశోర్‌రెడ్డి, హన్మంత్ వెంకట్‌రెడ్డి, నరేందర్, రేణుక అక్కయ్య, శ్రీనివాస్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సెల్‌ఫోన్ పోయిన వెంటనే 1930కి కాల్ చేయాలి



సైబర్ క్రైమ్ నమూనా చిత్రాలు

ఖిల్లా, ఆగస్టు 18: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెస్సేజ్‌లు, లింక్‌లు ఓపెన్ చేయరాదని సెల్‌ఫోన్ పోయిన వెంటనే (ఇతరుల ఫోన్‌తో) 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని నగర ఇన్‌స్పెక్టర్ నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. మీమొబైల్ నెంబర్‌పైన బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, ఉద్యోగాలు ఇస్తామని వచ్చే మెస్సేజ్‌లకు, కాల్స్‌లకు స్పందించరాదని తెలిపారు. వారితో పాటు బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ అయ్యిందని మీ అకౌంట్ నెంబర్ పైన రివార్డ్స్, పాయింట్స్ పొందడానికి యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవడం లాంటి మెస్సేజ్‌లను నమ్మకూడదని తెలిపారు. అదేవిధంగా గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీని అడుగుతారని వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వరాదని తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన, లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్‌లను త్వరితగతిన పట్టుకోవడానికి పోలీస్‌శాఖ సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ను ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్ రికవరీ కోసం ప్రతీ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ పొందిన ప్రత్యేక టీమ్ సభ్యులు ఉన్నారని తెలిపారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సెల్‌ఫోన్ పట్ల అశ్రద్ధ వహిస్తే ఫోన్‌లలో ఉన్న వ్యక్తిగత సమాచారం ఆధారంగా తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఇది వ్యక్తిగత సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. అదేవిధంగా ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనేముందు అప్లికేషన్‌లో ఆ ఫోన్ యొక్క వివరాలు అనగా ఐఎంఈఐ నెంబర్‌ను నమోదు చేసి చెక్ చేసుకోవాలని తద్వారా ఆ ఫోన్ యొక్క స్టేటస్ తెలుస్తుందన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74000	రూ.68,200	రూ.880


సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డబుల్ ఇస్మార్ట్ (9.00, 7.05)
: మిస్టర్ బచ్చన్ (12.25, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (3.50)
స్క్రీన్-2 : మిస్టర్ బచ్చన్ (9.10, 7.15)
: డబుల్ ఇస్మార్ట్ (12.35, 10.40)
: కమిటీ కుర్రాళ్లు (4.00)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (9.50, 1.05, 10.40)
: ఖేల్ ఖేల్ మెన్ (హిందీ) (4.20)
: తంగాలన్ (7.20)
స్క్రీన్-4 : తంగాలన్ (9.30, 12.50, 4.10)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)
: వేధ (హిందీ) (10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డబుల్ స్మార్ట్ (10.10, 4.15)
: తంగలాన్ (1.15, 7.20, 10.20)
స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (10.20, 7.20)
: మిస్టర్ బచ్చన్ (1.20)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.20, 10.20)
స్క్రీన్-3: మిస్టర్ బచ్చన్ (10.10)
: డబుల్ ఇస్మార్ట్ (1.10, 7.10, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (4.15)



దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (6.15, 9.15)
నటరాజ్ : స్త్రీ-2 (హిందీ) (11.15, 2.15,6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15,6.15, 9.15)
లలితామహాల్ : డబుల్ స్మార్ట్ (11.15, 2.15,6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్